# ప్రేమ ప్రేమే!

పళ్లేటి లక్ష్మీకులశేఖర్

శృంగార కథల పోటీలో మొదటి బహుమతి పొందిన కథ



**ఇబుడు** పిలువ తెర యెడలి వచ్చెను
దురపద రాజ పుతిరీ
అబయు అబయుమని అడుగులు తడబడ
నబినుతి జేయుచు నాదుని కడకు
యిబుడు పిలువ తెర యెడలి వచ్చెను
దురపద రాజపుతిరీ

ద్రవుపది వస్త్రాపహరణం వీధి నాటకంలో తెర వెడలి వచ్చిన ద్రవుపది పాడే ఆ పాట అన్నగార్లకు సద్దెత్తుక పోతూ సెనగ గనుమ మీద ఒయ్యారంగా నడుస్తున్న రుక్మిణి నోట వినిపిస్తాంది.

నెత్తిమీద కొలువు దీరి ఉన్న గంపలో మజ్జిగ అన్నం కలిపిన సద్దిముంత, దాని పక్కనే వంజకోవ డానికి అరడజను పచ్చి మిరపకాయలు, నాలుగు ఉల్లిపాయలు ఉన్నాయి. కవ్వంలా కదిలే నడుము కదలికలకు ముంత నుండి తొణిగిన కొన్ని సద్ది చినుకులు ఉల్లిపాయల్ని, మిరపకాయల్ని తడిపేసి ఉన్నాయి.

అటు నాగరికతకూ దగ్గర కాకుండా, ఇటు అనాగరికతకు దూరం కాకుండా గబ్బిలంలా వేలాడే వూ రా వూరు. పేరు బుడుగుంటపల్లె.

గడపలేమో రెండు వంద లుంటాయి. అందులో పచ్చగా బతికేవి వందుంఢవచ్చు. కాడెద్దులు, ఎకరా నేలతో బతికేవి యాభై గడప లుండొచ్చు. మిగతా యాభై ఏదో గడపకు బతుకు కట్టేసి బతుకు తున్నవే! కాడెద్దులు, ఎకరా నేలతో బతికే కుటుంబా లలో రుక్మిణి కుటుంబం ఒకటి.

వూరికి పడమరగా కలమందకుంట కింద నలుగురు భాగస్థుల ఆధీనంలో ఉన్న కపిల బావి. ఆ బావి కింది సాగులో ఎకరం మాగాణి ఉంది రుక్మిణి తండ్రి నరసయ్యకు. నరసయ్యకు ఇద్దరు కొడుకులు. ఇద్దరి వృత్తి వ్యవసాయమే. ఇద్దరి చివర ఒక కూతురు—అదే రుక్మిణి.

పూరీ నేసినట్టు వూరి చివరొక వూరు. వూరనరు దాన్ని. వాడంటారు. హరిజనవాడ.

పొలం గట్టుమీద పోతున్న రుక్మిణి నోట ఆగాగి వినిపిస్తున్న వీధి నాటకం పాట వెనక దాగున్న కథలో మాటేసిన కథానాయకుణ్ణి మీ ముందుకు తీసుకొస్తే, అతడి పేరు కూటాలు. అతడిది హరిజన వాడ.

బస్సు ముఖం చూడాలంటే పది మైళ్ళు, కరెంటు దీపం కనపడాలంటే ఇరవై మైళ్ళూ నడవాల్సిందే ఆ వూరి జనం. వర్షాలు సమృద్ధిగా పడి, పంటలు పుష్కలంగా వచ్చాయంటే వూరికి, వాడకు కొన్ని సరదాలు బయలు దేరతాయి. అలా పుట్టే సరదాల్లో వీధి నాటకం సరదా ఒకటి. ఈ సరదా తీర్చడానికి నాటకాల పెంచలయ్య వారు వూళ్ళో ఉండనే ఉన్నాడు. ఇటీవల సరిగ్గా ఇలాంటి సరదానే పుట్టింది. కుర్రకారంతా పెంచలయ్య ఇంటి కొచ్చి—

"డ్రామా యేదయినా ఒకటేరి పించయ్యా" అన్నారు. ఎప్పుడెప్పుడా అని నున్న పెంచలయ్య

"వూఁ నేర్చుకొండయ్యా" అన్నాడు.

"అయితే యేదేరి పిస్తావు జెప్పా?" అడిగారు.

"వస్త్రాపహరణం నేర్చుకొండి." అయ్యావారన్నాడు

"అదెందు కబ్బా. సారంగదరయితే బాగుండదా!"

"సారంగదరెందుకు లేరా. సుక్కలూరి రామ నాటకమయితే బాగుంటాది."

"సుక్కలూరి రామనాటకానికి లవకుసు లేసే పిల్లోల్లు గావద్దంట్రా. అంతమాత్రం మొకాలు మనూర్లో యాడుండారు?"

"ఎందుకులే అయివారా. మచ్చెంతరం జెప్పు నేరుసుకుంటాము."

ఇలా నలుగురు నాలుగు పేర్లు అనుకున్నాక చివరికి ద్రవుపది వస్త్రాపహరణమే ఖాయమయ్యింది.

నాటకా న్నారోజ నిర్ణయించారు. పాత్రల పంపిణీ కోసం మర్నాడు మళ్ళీ సమావేశ మయ్యారు.


"దుర్యోధను డెవరేస్తా రయ్యా?" అడిగాడు అయ్యవారు.

"కొండుగాడు బాగుంటా డయ్యా." ఒకరు సలహా ఇచ్చారు. అందరు వాడికేసి చూశారు. వాడు తనకు తెలిసిన గాంభీర్యంలో కనుబొమలు ముడి వేశాడు.

"ఏందీ కొండుగాడా! బాగుందిరా నువ్వు జెప్పేది. వాడు రాజేసికం యేస్తే మనందరము వోడికి దండం బెట్టాలద్దా?" తన అసమ్మతికి కారణంగా కులాన్ని తీసుకొచ్చాడు ఒకడు. కొండుగాడు హరిజనుడు.

"ఆఁ ఏముందాదిలేబ్బా. అట్లో దండం బెడ్తే యేముందాదిగానినిజంగా బెట్తాండామా ఏమన్నానా?" ఇంకొకరు సర్ది చెప్పినా చాలామంది విన్లేదు.

"అదట్టనీ గానబ్బా. ముందుగానే జెపుతాండా— మన కులాలు తలాలు ఉంటే అట్టుండనీ. కూటాలు గానికి మాత్రం మంచేసికమే యియ్యాల. వాడు మనిసీ బాగుండాడు, గొంతూ బాగుండాది." పెద్ద కులంలో పుట్టిన అర్హతను అర్హతగానే సూచిస్తూ ఒక మని షన్నాడు.



తర్జనలు భర్జనలు అయిపోయాయి. పాత్ర లన్నీ పంపిణీజరిగాయి. కూటాలుకు ద్రవుపది వేషం ఇచ్చారు. కూటాలు బాగా పాడతాడని రెండో ద్రవుపది ప్రసక్తి లేకుండా చివరంటూ ఒకడ్నే ఆడ మన్నారు. సరే నన్నాడు కూటాలు. కూటాలు అందం గానే ఉంటాడు. వయసులో ఉన్నాడు.

• • • •

నాటకం పూర్తయ్యింది. మొదటిగా శ్రీ రామాలయం ఎదురుగా ప్రదర్శించారు.

"వచ్చిరీ సోబ్తారులంతా వోయలు మీరాగాను యిపుడు"

నాంది అయ్యాక, చూపుదారులు పిలువగా సుయో ధనుడు సభను పావనం చేశాడు.

"రాజరాజేరాజాధిరాజే హెచ్చెనాదుర్యోదనరాజే!",

రాజసూయయాగ నిర్వహణలో మయ సభలో తన్ను పరాభవించ నెంచి పరిహసించిన పాంచాలి మీది క్రోధాన్ని కదంతొక్కుతూ మరీ వెలి బుచ్చాడు శకునితో. శకుని మాట మేరకు ఇంద్రప్రస్తపురము నుండి పాండవులు వచ్చారు.

"పంచా...పాండవులు వచ్చిరీ సభ చేరావేగా..."

కథ రక్తికి దగ్గరయ్యింది.

మాయ దురోదరం ప్రారంభమయ్యింది. ధర్మజుడు పాంచాలిని పిలిపించాడు.

"విభుడు పిలువ తెర వెడ వెడరి వచ్చెను ద్రుపద రాజపుత్రి..."

కమ్మటి కంఠం. ఆ పైన అందమైన విగ్రహం. కూటాలు ఒయ్యారంగా సింగారంగా ఒలక బోస్తూ సభకు వచ్చాడు.

"అబ్బా! ఎంత బాగుండాడే!" నిశ్శబ్దంగా ఉన్న జనంలో న తెలీకుండానే అనేసింది రుక్మిణి. అంత లోనే పరిసరాల్ని గుర్తించి అంతలోనే సర్దుకుంది. ఆ మాట వినిపించి ఒకసారి ఆవేపు చూశాడు కూటాలు. అలాగే చేష్ట లుడిగిన దానల్లే చూస్తూ ఉంది రుక్మిణి కూటాలు

ప్రోత్సాహ ముంటే అనూహ్య శిఖరాలకు విన్యసి స్తుంది కళ. ఇక్కడదే జరిగింది. రుక్మిణి మైమరుపు నివ్వెరపాటు కూటాలుకు ప్రోత్సాహంగా పరిణ మించాయి. కాలి గజ్జె కుపీదీరా కదిలింది. కథ నిరా ఘాటంగా సాగుతూంది.

దుశ్శాసనుడు ప్రవేశించాడు. ద్రవుపదీ దుశ్శాస నుల సంవాదము తారస్థాయి నందుకుంది.

"నేనూ నిన్నేల పోనిచ్చేను. నా ఠింద్రప్రస్తపురి లోను మా యన్నజూరి పడగాను, నవ్విన దానవు నువ్వేను." పులిలా దూకాడు దుశ్శాసనుడు.

"వోరి పాపాత్మా!" రుక్మిణి బాధ పడ్డది.

"పాపాత్మా. ఇదియేమి పాటురా. సిగ పట్టేవు నీ కేమి మేటురా." కూటాలు విషద గీతానికి కరిగింది రుక్మిణి.

"నిజంగా దుశ్శాసనుడు పాపాత్ముడే, కూటాలు కూడా అదే పాడాడు" అనుకుంది.

కళ్ళుకు రెప్పవెయ్యడం మరిచి పోయి తదేకంగా నాటకాంతం కూటాల్నే చూస్తూ ఉండి పోయింది రుక్మిణి.

అందుకే పోతూ పోతూ అంది—

"కూటాలూ ఇంటికి బోయినాక దిట్టి దీయించ్చ కో. యెంత బాగ జేసినావు కూటాలు. ఆడదాన్ని నాకే సిగ్గేసింది."

శిఖర మెక్కి పతాకం పాతిన వీరుడల్లే ఒకసారి ఠీవాగా రొమ్ము విరిచాడు కూటాలు.

• • • •

అప్పటి నుండి రుక్మిణి ఎక్కడున్నా, ఏం చేస్తున్నా ద్రవుపది పాటలే పాడుతూ ఉంటుంది ఉంది.

రుక్మిణి నిశ్చలమైన సరస్సు లాంటిది.

ఆర్థిక పరిస్థితులు బాగలేక తలి దండ్రులు పెళ్ళి మాట తల పెట్టక పోయినా పొరపాటున కూడా ఆ దారిలోకి మనసుని వెళ్ళ నిచ్చేది కాదు. స్త్రీలో కలిగే సహజమైన కోరిక ఎప్పుడో ఒకసారి నే నున్నానంటూ తలెత్తినా అంతకు మించిన నిగ్రహం, సంస్కారం మొండిగా ఆ కోరికను తొక్క ముడిచేలా చేశాయి.

అయినా ఆ రోజునుండి నిర్మలంగా ఉన్న హృదయ సాగరంలో తెలియని తీపి అలలు పుట్టాయి. అసలు కూటాలు రుక్మిణికి కొత్తే, కాదు. పొద్దుటి నుండి సాయంత్రం వరకు ఎన్నో సార్లు చూసి, చూస్తున్నవాడే.

కాని, అతనిలో మరో వ్యక్తి ఉన్నట్టు ఆ నాడే అనిపించింది.

బహుశః కళకున్న అనిర్వచనీయ మైన ఆకర్షణకు రుక్మిణి హృదయం అర్థం చెబుతూందేమో!

ఏది ఏమైనా ప్రేమ ప్రేమే. దానికి తరతమ భేధం లేదు.

రెడ్డివారి ఇంటి దగ్గర మరో నాటకం ఖాయ మయింది. ఎగిరి గంతేసింది రుక్మిణి. ఒక చోట నిలవలేక పోయింది. పెళ్ళంతా గొలికి తనకు చేయిం చిన మామిడి పిందెల గొలుసు భద్రంగా పట్టు కెళ్ళింది ఆ సాయంత్రం.

"కూటాలు. ఏషికం మీద యిదేసుకో!" ఇవ్వబోతూ అంది.

"ఏంది రుప్పినమ్మా. బంగారుగా. వోయమ్మ. పాయి ందంటే శానాపావు. వద్దులే. "కూటాలు వద్దన్నాడు.

"ఏసుకో కూటాలు." బుజ్జగించి మెడలో వేసింది.

ఆ రాత్రి మామిడి పిందెల గొలుసు కూటాలు ఎదమీద ఎగిరెగిరి పడుతుంటే కూటాలు రుక్మిణి గుండెలో ఎగిసి పడ్డాడు.

నాటకం అయిపోగానే వేషం విప్పకుండా వచ్చి—

"ఇదో రుప్పినమ్మా. యేసుకోనేమో యేసుకున్నా కాని నా లోకమంత దీనిమీదే ఉంది" అని ఇచ్చేశాడు గొలుసుని.

"నా లోకం మాత్రం నీ మీదే ఉంది కూటాలు." అస్పష్టంగా అంది వణికే పెదవుల్ని అదుపులోకి తెచ్చు కుంటూ.

ఆ నాడే అర్థమయింది రుక్మిణి మనసు కూటాలుకు. ముందు కాస్త జంకినా పిచ్చి లాంటి ఆమె ప్రేమకు కరిగి తల వాల్చాడు చివరకు.

ఒక రోజు ఒక స్నేహితురాలితో అంది రుక్మిణి:

"సరేనే. కూటాలు గనిలో సెపితే... నిన్ను మళ్ళెప్పుడు పెళ్ళి జేసుకుంటారే?" ...న్న మాట

ఆ స్నేహితురాలు అంది.

"కూటాల్నే జేసుకుంటా!" దృఢంగా అంది రుక్మిణి.

"మల్లాడ బతుకుతారు?" ఎక్కడా బతకలేరు అనేలా ఉందా మాట. మాట్లాడ లేదు రుక్మిణి.

"పిచ్చిదానా, ఒక శూద్దర పిల్ల హరిజన పిల్లోణ్ని జేసుకుందంటే...నీ కతట్టుట్లే—నీ యమ్మ నాయిన్ని అన్నల్ని యీ వూరోల్లు మానాన, పానాన ఉన్ని స్తారా?" సానుభూతికూడా ఉందా మాటలో.

"కూటాలు లేకపోతే నేను బతక లేను. ఒక రోజయినా సరే, ఆయనికి పెళ్లాన్ని అనిపించుకుంటే సాలు."

ఇలా చినుకులుగా ప్రారంభమైన రుక్మిణి మాటలు జడివాన అయ్యాయి. స్నేహితురాలు చేష్టలుడిగి పోయింది.

కూటాలుకు వార్త అందాయి. భయపడినా, తెగించినా, ముగింపు ఇద్దరికీ తెలుసు. అందుకే "అసహాయిని" అయిన ప్రేమను ముందేసుకుని ఇద్దరూ ఏడ్చుకున్నారు.

ఒకటి కావడానికి తెగించారు. ప్రేమ ప్రశ్న అయితే పెళ్ళి జవాబు కావాలి. పెళ్ళి పిరికిదై పారిపోయినప్పుడు ఆ స్థానంలో మోహమే శాశ్వత మయ్యింది. క్షణికమైన ఆ ఆనందమే ప్రేమకు నిర్వచనం కాదు అని వారికి తెలియదు. కారణం—వారిద్దరు అమాయకులే. అయినా తొందర పడలేదు. పీకే ప్రాణానికి పీట వేసి కూర్చో పెట్టాలని ఒక ముహూర్తం నిర్ణయించారు.

• • • •

ఆ రోజు కరణం గారింటి దగ్గర నాటకం.

తెల్లవారుజాము నాలుగు గంటలకు అయ్యిందనిపించింది. మసక వెలుతురులో ఇద్దరూ మారెమ్మగుడికి నడిచారు. తలుపులు బద్దలు కొట్టి, అమ్మవారి తాళిని తస్కరించారు.

మారెమ్మగుడిలో ఆయమ్మ తాళితోనే ఆత్మార్పాటంగా అయింది పెళ్ళి. పేరుకున్న కలలు, పూరుతున్న ఆశలు వూపిరి పీల్చుకుని ఆ ఇద్దరి మీద స్వైర విహారం చేశాయి.

అనుభవం తీయగా మిగిలింది.

• • •

రెండు రోజులయ్యింది.

తాళి బయట పడింది. ప్రళయం ప్రారంభమయ్యింది. పరువు. ప్రతిష్ఠ, నీతి, హోదా—ఇవన్నీ గడప ముందు నిలబడి మాగతేం కావాలి అన్నాయి. అన్న లిద్దరూ ఇష్ట మొచ్చిన రీతిలో రుక్మిణిని తిట్టి, కొట్టి ఆ మగాని పేరు చెప్పమని బతిమాలారు. ఒంటిమీద చర్మం సజీవంగా వలిచినా అతని పేరు చెప్పనంది రుక్మిణి, తన మూలంగా ఒక ప్రాణి బలి కాకూడదని. పెద్దన్న ఉగ్ర నరసింహావతార మెత్తాడు.

"మ్మేం—రుప్పినీ. వాడెవుడో మాకు తెలీక పోయిన కూలోడో గీలోడో అయ్యుంటాడు. అందుకే నువ్వు జెప్పలా! నిన్ను బతకనీం. నువ్వు సచ్చినాక ఆ నా కొడుకు నీ గోరీ కాడికైనా రాడా? అప్పుడయినా వాన్ని జంపక పోము!"

అందుకున్న రోకలి విసురుగా రుక్మిణి పైన దూకింది.

"అమ్మో!"

అనంత వాయువులు ఆమె నాహ్వానించాయి.

చాటుగా ఇదంతా విన్న కూటాలు స్థాణువులా ఉండిపోయాడు.

• • • •

"నా పేరు జెప్పితే...నన్ను చంపుతారని...నా కోసం నువ్వు సచ్చినావా రుప్పినీ. ఛ. పిచ్చిదానా! అట్టెందుకు జేసినావే. ఇప్పుడు నే నెట్ట బతకాలే. సచ్చే దానికి నాకు ధైర్యం సాల్లా. అందుకే నువ్వు సచ్చినచోట్టే సద్దామని అనుకున్నానే. ఒకటిగా సావకపోతిమే..."

రుక్మిణి సమాధి దగ్గర కూర్చుని బివురుమని ఏడుస్తున్న కూటాలు దూరంగా అలికిడి కావడంతో లేచి అటుగా నడిచాడు.

"యాడికి బోయ్యొచ్చుండావురా?" అడిగాడు రుక్మిణి అన్నలు.

"పొయ్యింది నా రుప్పిని గోరి కాడికి, వచ్చింది మీ చేత సావడానికి..." అది కూటాలు చివరి మాట.

"ఒరేయ్!"

అరుపుల్లో అరుపు—మెరుపులా కూటాలు ప్రాణం రుక్మిణిని చేరుకుంది.

వారే మయినా, వారిని అవస్థ పెట్టినా, చంపినా ప్రేమ ప్రేమే! ప్రేమ ప్రేమే!

